క్లుప్తంగా

టేబుల్ టెన్నిస్ పోటీలు



టేబుల్ టెన్నిస్ ఆడుతున్న విద్యార్థులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ అల్ఫోర్స్ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. ఇందులో సుమారు 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జోనల్‌స్థాయి ఎంపిక చేస్తామని ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్ తెలిపారు. మాజీ సెక్రెటరీ రమణారావు, పీడీ దేవేందర్, పీఈటీలు పెంటన్న, సహదేవ్, శ్రీనివాస్, భూమేశ్, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొజ్జుకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కడెం: మండలంలోని మారుమూల ప్రాంతమైన ఇస్లాంపూర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కోరారు. గురువారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బొజ్జు పటేల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రోడ్డు, త్రీఫేజ్, సౌకర్యం కల్పించి పెద్దచెరువుకు మరమ్మతులు చేయించాలని కోరారు. ఇందులో జైతు, అచ్చంతరావు, పత్మరావు, శంభు, మోహన్ తదితరులున్నారు.

యువతి అదృశ్యంపై కేసు

సోన్: మండలంలోని సిద్దులకుంటలో బొజ్జ స్పందన (20) అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్సై కె.గోపి తెలిపారు. లోకేశ్వరం మండల కేంద్రానికి చెందిన బొజ్జ స్పందన తన నానమ్మ ఉండే సోన్ మండలం సిద్దులకుంటకు ఈనెల 20న వచ్చింది. 25న లోకేశ్వరం వెళ్తానని వాళ్ల నానమ్మకు చెప్పి సిద్దులకుంట నుంచి వెళ్లిన స్పందన ఇంటికి చేరుకోలేదని పేర్కొన్నారు. బంధువులు, మిత్రుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో యువతి సోదరి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యమకారులు తరలిరావాలి

భైంసాటౌన్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రాంగణంలో ఈనెల 27న తెలంగాణ ఉద్యమకారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఫోరం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముష్కం రామకృష్ణ గౌడ్ తెలిపారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ కోదండరాం హాజరవుతారని.. జిల్లా నుంచి ఉద్యమకారులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

వారసంత ప్రారంభం

లోకేశ్వరం: మండలంలోని ధర్మోరలో గురువారం వారసంతను వీడీసీ సభ్యులు ప్రారంభించారు. అమ్మకందారులను సన్మానించి భోజనం ఏర్పాటు చేశారు. వీడీసీ సభ్యులు మంద లింగన్న, నర్సాగౌడ్, అసిబొద్దీన్ పటేల్, ఆకుల భోజన్న, జంబుగ సాయన్న, మంగళి దేవిదాస్, ఒడ్డెన్న, ప్రసాద్, సాయన్న, నరేశ్, సాయారెడ్డి ఉన్నారు.

మానసిక వికాసంతో ఒత్తిడి దూరం

సారంగాపూర్: మానసిక వికాసంతోనే ఒత్తిడిని అధిగమించవచ్చని డాక్టర్ అల్లాడి సురేశ్ అన్నారు. మండలంలోని చించోలి(బి) ఎక్స్‌రోడ్డు సమీపంలోని మైనార్టీ గురుకులంలో గురువారం బాలశక్తిలో భాగంగా విద్యార్థులకు మానసిక వికాసం, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ పై తరగతులు నిర్వహించారు. విద్యార్థులు ఖాళీగా ఉండకుండా తమ అభిరుచులకు అనుగుణంగా ఆటలు, పాటలు, చిత్రలేఖనం, సంగీతం, నాట్యంపై దృష్టిసారించాలని అన్నారు. జిల్లా సమన్వయకర్త జ్యోతి, ప్రిన్సిపాల్ ప్రకాశ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పర్యటన

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థులు గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో పట్టణ శివారులోని మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్‌ను సందర్శించారు. తాగునీటి సంరక్షణ, క్లోరినేషన్ అంశాలను తెలుసుకున్నారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి రఘునాథ్, అధ్యాపకులు భీంరావు, రవికుమార్, సుధాకర్, ఓంప్రకాశ్, శ్రావణ్య, అర్షియా బేగం ఉన్నారు.

పార్‌పెల్లిలో వైద్యశిబిరం

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి ఆరోగ్య ఉపకేంద్రం ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. పార్‌పెల్లిలోని 6,7,8 వార్డుల్లో ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నందున.. రక్తపరీక్షలు చేసి మందులను అందజేశారు. ఆరోగ్య విస్తరణాధికారి హరికుమార్ గౌడ్, ఆరోగ్య కార్యకర్త శివకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వీరత్వానికి ప్రతీక ఐలమ్మ

- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్
- గ్రామాల్లో చాకలి ఐలమ్మ జయంతి
- నివాళులర్పించిన నాయకులు, అధికారులు



ముధోల్‌లో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్, నాయకులు

ముధోల్: తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న చాకలి ఐలమ్మ వీరత్వానికి ప్రతీక అని.. ప్రతి ఒక్కరూ ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో వారి విగ్రహానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. భూమేశ్, లక్ష్మీనారాయణ, పోతన్న యాదవ్, అనిల్, రమేశ్, సతీశ్ రెడ్డి, రజకసంఘం నాయకులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని హవర్గ, గడ్‌చాంద, లోకేశ్వరం, రాజూర, పుస్పూర్‌లో రజకసంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటాలకు, విగ్రహాలకు నివాళులర్పించారు. ఎంపీడీవో వెంకటరమేశ్ సోలమాన్‌రాజ్, ఏపీవో జగన్నాథ్, భోజారం, భూమన్న, నవీన్, భోజన్న, హరీశ్, జీవన్ పాల్గొన్నారు.

మామడ: మండల పరిషత్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ అన్నపూర్ణ, సీనియర్ అసిస్టెంట్ ఉపేందర్, సిబ్బంది ఉన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో రజకసంఘం సభ్యులు, నాయకులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ చిన్నరామయ్య, రాంరెడ్డి, గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని తన కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి తహసీల్దార్ జానకి నివాళులర్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద రజక, ప్రజాసంఘాల నాయకులు ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆర్డీవో కార్యాలయంలో కోమల్‌రెడ్డి, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బి.రాజేశ్‌కుమార్, తహసీల్దార్ కార్యాలయంలో ప్రవీణ్‌కుమార్, ఇతర కార్యాలయాల్లో అధికారులు నివాళులర్పించారు.



భైంసాలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద..



సోన్: న్యూబొప్పారంలో..

సోన్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఐలమ్మ జయంతి నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ వద్ద ఐలమ్మ విగ్రహానికి ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యులు రామగిరి రవీందర్ నివాళులర్పించారు. ప్రచార కమిటీ సభ్యులు షేక్ నయీం, కల్లూర్ సుధాకర్, భూమేశ్ మహరాజ్, శేఖర్ మహరాజ్, శ్రీనివాస్, పరమేశ్ పాల్గొన్నారు. టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. అధ్యక్షుడు వెలుమల ప్రభాకర్, కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, ఆనంద్, చంద్రప్రకాశ్‌గౌడ్ పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్, మహాగాం గ్రామాల్లో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. మహాగాం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని నందిని ఐలమ్మ వేషధారణలో ఆకట్టుకుంది. ముత్యంరెడ్డి, రాంకుమార్, శ్రీనివాస్, హెచ్‌ఎం దేవిదాస్, కృష్ణ, హరీశ్ తదితరులున్నారు.



నిర్మల్‌లో నినాదాలు చేస్తున్న టీఎన్జీవోలు

కుంటాల: మండలంలో ఐలమ్మ జయంతి నిర్వహించారు. తహసీల్దార్ ఎజాజ్‌అహ్మద్ ఖాన్, ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీం, కార్యదర్శి రాజబాపు, దత్తాద్రి, లక్ష్మిరమేశ్ పాల్గొన్నారు.



భైంసారూరల్ : వానల్‌పాడ్‌లో..



లోకేశ్వరంలో..



నర్సాపూర్(జి)లో..

బాధ్యతలు స్వీకరించిన ఎంఈవోలు

కడెం: నూతన ఎంఈవోగా మండలంలోని పాతమద్దిపడగ జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం షేక్ హుస్సేన్ నియమితులయ్యారు. గురువారం ఇన్‌చార్జి ఎంఈవో మధుసూదన్.. తన బాధ్యతలను షేక్‌హుస్సేన్‌కు అప్పగించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణ, రాజేశ్ నాయక్, మహేశ్వర్, సీఆర్పీలు తదితరులున్నారు.

ఖానాపూర్ ఎంఈవోగా ప్రేంసాగర్

ఖానాపూర్: ఖానాపూర్ ఎంఈవోగా మండలంలోని సత్తనపల్లి హైస్కూల్ హెచ్‌ఎం ప్రేంసాగర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఈవోగా పని చేసిన మధుసూదన్, నూతన ఎంఈవోను కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు సన్మానించారు. భూసారపు గంగాధర్, బెజ్జారపు మురళి, డి.శ్రీనివాస్, డి.నర్సయ్య, మారుతిస్వామి, విజయ్ తదితరులు ఉన్నారు.

మామడ ఎంఈవోకు సన్మానం

మామడ: మామడ ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన వై.వెంకటరమణారెడ్డిని గురువారం తన కార్యాలయంలో పీఆర్టీయూ నాయకులు సన్మానించారు. పీఆర్టీయూ మండలాధ్యక్షుడు కృష్ణకిశోర్, ప్రధాన కార్యదర్శి రాజన్న, మారెన్న, చక్రధర్, రాంమోహన్, సురేందర్‌రెడ్డి, శిల్పలు ఉన్నారు.

కుభీర్ ఎంఈవోగా విజయ్‌కుమార్

కుభీర్: మండలానికి నూతన ఇన్‌చార్జి ఎంఈవోగా నిగ్వా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎంఈవోను పలువురు ఉపాధ్యాయులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో నాగభూషణ్, తుల శ్రీనివాస్, శంకర్, కత్తి నాగోరావ్, రామ్‌చందర్, సిందే దత్తాత్రి, రాసం రాజేశ్వర్, సంగి రాజేశ్వర్, గడపాలే దత్తాత్రి తదితరులు ఉన్నారు.



కుభీర్‌లో ఎంఈవో విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తానూరు ఎంఈవోగా నరేందర్

తానూరు: తానూరు ఎంఈవోగా మండలంలోని ఎల్వి జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.నరేందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎంఈవోను ఎంఈవో కార్యాలయంలో పలువురు సన్మానించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్, పీఆర్టీయూ స్టేట్ అసోసియేట్ అధ్యక్షుడు గజ్జారాం, మల్లన్న, మండలాధ్యక్షుడు పండరి, ఉపాధ్యాయులు సాయిబాబు, మాధవ్‌రావ్, శంకర్ తదితరులు ఉన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంఈవో

ముధోల్ ఎంఈవోగా రమణారెడ్డి

ముధోల్: మండలానికి నూతన ఎంఈవోగా రమణారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు.

నిధుల మంజూరుకు వినతి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని గౌడ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ (గోపా) భవన నిర్మాణం పూర్తికి నిధులు మంజూరు చేసేందుకు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు హామీ ఇచ్చినట్లు ఆ సంఘం ప్రతినిధులు తెలిపారు. గురువారం వారిని తన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. ఇందులో సంఘం అధ్యక్షుడు రామాగౌడ్, ప్రతినిధులు పద్మనాభగౌడ్, అయ్యన్న గౌడ్, రామనాథ గౌడ్, గణేశ్‌గౌడ్, గజరాజ్ గౌడ్, గంగాధర్, నారాయణ్ గౌడ్ ఉన్నారు.

వీడీసీ కార్యవర్గం

కుంటాల: మండలంలోని ఓలాలో నూతన వీడీసీ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎగ్గం నర్సింలు, ఉపాధ్యక్షుడిగా నేతిని నర్సయ్య, కోశాధికారిగా జాదవ్ గంగాప్రసాద్, కార్యదర్శిగా తుమ్మల రాజకుమార్ ఎన్నికయ్యారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

లక్ష్మణచాంద: పోలీస్‌స్టేషకు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని సోన్ సీఐ నవీన్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సీఐ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులు పరిశీలించి. పాత కేసుల వివరాలను తెలుసుకున్నారు. లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకునే కేసుల వివరాలను ఎస్సై సుమలతను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ నవీన్‌కుమార్

ఈ పాఠశాలకు వీవీనే దిక్కు..

- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

కుంటాల: మండలంలోని ఓలా ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చదువు అందని ద్రాక్షగా మారింది. ఇక్కడ 62 మంది విద్యార్థులున్నా.. ఉపాధ్యాయులు లేరు. ఇటీవల బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేసే హెచ్‌ఎం సాజిద్ మిరాజ్‌ను నిర్మల్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో మరో ఉపాధ్యాయుడు పాఠశాలకు వచ్చిన తర్వాతే మిరాజ్‌ను రిలీవ్ చేయాలి. కానీ అధికారులు నిబంధనలు ఉల్లంఘించి అతడిని నిర్మల్‌కు పంపించారు. గత హెచ్‌ఎం జీతం ఇచ్చి నియమించిన ఒక విద్యావలంటీర్(వీవీ) మాత్రమే ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు పాఠాలు చెబుతుంది. విద్యార్థుల సంఖ్యను బట్టి ఇక్కడ ముగ్గురు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ఒక్కరూ లేరు. డీఈవో, ఎంఈవోకు విన్నవించినా పట్టించుకోవడంలేదని పలువురు గ్రామస్తులు వాపోతున్నారు.



ఓలాలో పాఠాలు చెబుతున్న విద్యావలంటీర్

సంక్షిప్త వార్తలు

వీధులు పరిశుభ్రంగా ఉంచాలి

లక్ష్మణచాంద: వీధులను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాధ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని రాచాపూర్ ఎస్సీ కాలనీలో పారిశుధ్య పనులను పరిశీలించారు. నేషనల్ ఇండియా లిటరసీ ప్రోగ్రాం గురించి జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం ఉపాధిహామీ సిబ్బందితో కలిసి చామన్‌పెల్లిలో హార్టికల్చర్ ప్లాంటేషన్‌ను పరిశీలించారు.

చెక్కు అందజేత

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల బిల్లులకు సంబంధించి మంజూరైన రూ.60వేల చెక్కును గురువారం పాఠశాల చైర్మన్ రాజ్యలక్ష్మికి అందజేశారు. ఉపాధ్యాయుడికి బిల్లు చెల్లించే అధికారం లేకపోవడంతో కాంప్లెక్స్ హెచ్‌ఎం రమాదేవి అధికారులతో మాట్లాడి చెక్కు అందజేశారు.

'వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి'

లక్ష్మణచాంద: గత ప్రభుత్వ నిర్ణయం మేరకు తమకు ఉద్యోగాలు ఇవ్వాలని మండలంలోని వీఆర్‌ఏల వారసులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జానకికి వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వం 61 ఏళ్ల పైబడిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించేందుకు జీవో నెంబర్ 81, 85 జారీ చేసిందని.. కానీ ఇప్పటికీ ఉద్యోగాలు కల్పించలేదని పేర్కొన్నారు. ముత్తవ్వ, భూమేశ్, నర్సవ్వ, సుధాకర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి'

కుభీర్: ప్రభుత్వం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును సురవరం ప్రతాపరెడ్డిగా మార్చడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని మండలంలోని ఆర్యవైశ్యసంఘం నాయకులు గురువారం తహసీల్దార్ ఎం.సోముకు వినతిపత్రం అందజేశారు. నాయకులు రెడిశెట్టి ఆనంద్, రెడిశెట్టి నిఖిల్, ఆర్.వెంకటేశ్, సూరజ్, అక్షయ్ ఉన్నారు.

దివ్యాంగులు అధైర్యపడొద్దు

కుంటాల: దివ్యాంగులైన విద్యార్థులు అధైర్యపడొద్దని.. ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని ఎస్సై సీహెచ్.భాస్కరాచారి పేర్కొన్నారు. గురువారం కుంటాలలోని భవిత కేంద్రం సందర్శించారు. హెచ్‌ఎం .కె.పుష్పలత, ఏఎస్సై రాందాస్, రాజ్‌కుమార్, దశరథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో లైబ్రరీ పీరియడ్ ఉండాలి

లోకేశ్వరం: పాఠశాలలో ప్రతి తరగతికి లైబ్రరీ పీరియడ్ ఉండాలని ఎంఈవో చంద్రకాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల తెలుగు ఉపాధ్యాయులకు ఎఫ్‌ఎల్‌ఎన్, రూమ్ టూ రీడ్‌పై శిక్షణ నిర్వహించారు. మురళీధర్, ప్రవీణ్‌కుమార్, రూమ్ టూ రీడ్ ప్రతినిధి మమత, సీఆర్పీలు ప్రవలిక, సునీత, వసంత, లక్ష్మి తదితరులున్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

సారంగాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం డాక్టర్ నితిన్ విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు చేశారు. 61మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ముగ్గురిని నిర్మల్ ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

సారంగాపూర్: మండలంలోని హనుమాన్ తండాలో గురువారం ఏఎన్‌ఎం సునీత గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరపీడితులను గుర్తించి మందులు పంపిణీ చేశారు. కార్యదర్శి రాజేందర్, అర్చన, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

ఖానాపూర్: పట్టణంలోని 11వ వార్డులో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. అనిల్‌రావు, ఎనగందుల కుమార్, రంజిత్, తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని అంబకంటి, కుంటాల గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. బీజేపీ మండల కన్వీనర్ గుద్దేటి నర్సయ్య, గజేందర్, తాటి శివ, పంగెర స్వప్న, మాధవరావు, పోతన్న, ప్రవీణ్, నవీన్ పాల్గొన్నారు.

తానూరు: మండలంలో జౌలా(బి), తొండాల, ఖర్బాలా, దౌలతాబాద్ గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు వై.చిన్నారెడ్డి , కృష్ణ, లక్ష్మారెడ్డి, ఎల్లప్ప, సంతోష్, సాయినాథ్, మాధవ్‌రావ్ పటేల్ పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

కుంటాల: మండలంలోని ఓలాలో గంది శంకర్ స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006-07లో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు గురువారం పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 17 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సందడిగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఆహ్వానించి సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రైతులకు చెక్కులు అందించిన ఎమ్మెల్యే

భైంసాటౌన్: ఇటీవలి వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో రైతుల పశువులు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. దీంతో వారికి ప్రభుత్వం నుంచి పరిహారం మంజూరవగా గురువారం పట్టణంలోని పశువైద్యశాలలో ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ బాధితులకు చెక్కులు అందజేశారు. బడ్గాంకు చెందిన జోగ్‌దాండే భోజరాంకు రూ.32వేలు, ముధోల్ మండలం మచ్కల్‌కు చెందిన సూర్యవంశీ సదాశివ్‌పటేల్‌కు రూ.50 వేల చెక్కు అందజేశారు. పశువైద్యాధికారి విఠల్, బీజేపీ నాయకులు భీంరావు, రమేశ్, గాలి రవి, పోశెట్టి తదితరులున్నారు.

భైంసాటౌన్: నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. మండలంలోని చింతల్‌బోరిలో రాజరాజేశ్వర ఆలయ పూజారిగా నియమితులైన జంగం మహేశ్‌కుమార్‌కు భైంసాలోని తన నివాసంలో నియామకపత్రం అందజేశారు. ఏడాదిన్నరగా ఆలయంలో పూజారి లేకపోవడంతో గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు పండిత్‌రావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వారు స్పందించి పూజారిని నియమించారు. కార్యక్రమంలో సల్ల శంకర్, పోతాజి పటేల్, రాజేశ్వర్, మారుతి పటేల్ తదితరులు ఉన్నారు.



భైంసాలో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు

డిగ్రీ కళాశాల సందర్శన

ముధోల్: మండలకేంద్రంలో నూతనంగా ఏర్పాటవుతున్న డిగ్రీ కళాశాల భవనాన్ని ఎమ్మెల్యే రామారావు పటేల్ గురువారం సందర్శించారు. భవనాన్ని పూర్తిగా కళాశాలకు అప్పగించలేదని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో పరిశీలించారు. భవనాన్ని కళాశాలకు అప్పగించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం పలు వివరాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట బీజేపీ నాయకులు కోరి పోతన్న, సుదర్శన్ తదితరులున్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామాల మంచినీటి సహాయకులకు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈసందర్భంగా ఎంపీడీవో అరుణారాణి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందుకు రాకుండా చూడాలని పేర్కొన్నారు. అనంతరం మంచినీటి సహాయకులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కుంటాల ఎంపీడీవో లింబాద్రి, దిలావర్‌పూర్, నర్సాపూర్(జి), కుంటాల ఎంపీఓలు గోవర్ధన్, తిరుపతిరెడ్డి, రహీం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

సోన్: మిషన్ భగీరథ ఆధ్వర్యంలో సోన్, నిర్మల్‌రూరల్ మండలంలోని గ్రామాల సహాయకులకు సోన్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ ముగిసిందని ఎంపీఓ ఖలీల్ హైమద్ పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. భగీరథ ఏఈఈ వినోద్, సిబ్బంది ఉన్నారు.

30న సత్యాగ్రహ దీక్షకు తరలిరావాలి

- నవ సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అప్క గజేందర్ యాదవ్

నిర్మల్‌టౌన్: బీసీలంతా ఏకమై ఈనెల 30న ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహించే సత్యాగ్రహ దీక్షకు తరలిరావాలని నవ సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అప్క గజేందర్‌యాదవ్ కోరారు. గురువారం నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చేపట్టే దీక్షలో నవ సంఘర్షణ సమితి ఆల్ ఇండియా చైర్మన్ జైహింద్ గౌడ్ పాల్గొంటారని పేర్కొన్నారు. వచ్చే స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నవ సంఘర్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి నర్సారెడ్డి, అధికార ప్రతినిధి లింగన్న, ఉపాధ్యక్షుడు జక్కుల మల్లేశ్‌యాదవ్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న గజేందర్ యాదవ్

స్వచ్ఛత హీ సేవా వారోత్సవాలు

నిర్మల్‌టౌన్: స్వచ్ఛత హీ సేవా వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినీనగర్ ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో గురువారం మున్సిపల్ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. ముందుగా విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పిచ్చికుక్కల జోలికి పోవద్దని సూచించారు. ఉపాధ్యాయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, పర్యావరణ ఇంజినీర్ అజారుద్దీన్ ,రాజేంద్రప్రసాద్, సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

కుంటాల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో లింబాద్రి పేర్కొన్నారు. స్వచ్ఛత హీసేవా కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని విఠాపూర్‌లో అధికారులు శ్రమదానం చేసి పిచ్చిమొక్కలు తొలగించారు. ఎంపీవో ఎంఏ. రహీం, ఏపీవో గట్టుపల్లి నవీన్, పంచాయతీ కార్యదర్శి ఉత్తం తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: స్వచ్ఛత హీ సేవాలో భాగంగా గురువారం మండల కేంద్రంలో ఎంపీడీవో వెంకటరమేశ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. గ్రామాల్లోని రోడ్లను శుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సోలమాన్‌రాజ్, గ్రామ కార్యదర్శి వినయ్‌సాయి, సిబ్బంది ఉన్నారు.



నిర్మల్‌లో శ్రమదానం చేస్తున్న సిబ్బంది

మామడ: మండలంలోని నల్దుర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో శ్రమదానం చేశారు. పిచ్చిమొక్కలు తొలగించి గ్రామంలో ర్యాలీ అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుభీర్: మండలంలోని జుమ్డాలో అధికారులు శ్రమదానం నిర్వహించారు. ఎంపీడీవో నవనీత్ కుమార్ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం నర్సరీని పరిశీలించారు. వారి వెంట ఉపాధ్యాయులు రాంచర్, పంచాయతీ కార్యదర్శి రమేశ్ ఉన్నారు.